క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పొన్నూరు: పట్టణంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ సీఐ పి.భాస్కర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై నిలుపరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవోపా ఆధ్వర్యంలో గోసేవ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరువారి తోటలోని రాధాకృష్ణ గోశాలలో గోసేవ, గోపూజ నిర్వహించారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ 75 వారాలుగా గో సేవ చేయడం అభినందనీయమన్నారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కొత్తూరి వెంకట్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొనగళ్ల సత్యం మాట్లాడారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, మద్ది సాయి రమేష్, రమణానంద్, వెంకట్రావు, కంచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనాన్ని తినాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని తినాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి కోరారు. శుక్రవారం రైలుపేటలోని గొలుసు కొండలరావు– నాంచారమ్మ నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలను సందర్శించి, పీఎం పోషణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలారాణి, ఉపాధ్యాయులు, ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది మధ్యాహ్న భోజనం తినేందుకు ఆసక్తి చూపకపోవడంపై ఆరా తీశారు. మెనూ పాటిస్తూ రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ కోడిగుడ్డు అందించడంతో పాటు చిక్కీ ఇవ్వాలని కోరారు. మెనూ నాణ్యతలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో గుంటూరు తూర్పు ఎంఈఓ– 2 నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామ సచివాలయం–3 పరిధిలో ఏఎన్ఎం స్వప్న, ఎంఎల్‌హెచ్‌పీ రజని, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అతిసార విషయంలో ప్రజల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై స్టాప్ డయేరియా పేరిట అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ అతిసార బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు, పెద్దలకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అతిసార సమస్యలుంటే వెంటనే పీహెచ్‌సీలో తెలపాలని కోరారు.

విత్తన దుకాణాలలో తనిఖీ

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో విత్తన దుకాణాలలో అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు తెలిపారు. అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విక్రయాలలో ఎలాంటి అవకతవకలు జరిగినా ఆయా షాపుల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్ రామ్ వర్ధంతి

మంగళగిరి: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో యజమానులకు నష్టం

- 45 రోజుల్లో టీడీఆర్ బాండ్లు అందేలా చర్యలు
- రోడ్డు విస్తరణ బాధితులకు ఎమ్మెల్యే నరేంద్ర హామీ



టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: బాధ్యతల నిర్వహణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మున్సిపాలిటీ అధికారులు ప్రజల్లో నమ్మకం కోల్పోయారని వ్యాఖ్యానించారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన భవన యజమానులతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన యజమానులు తమ సమస్యలను వివరించారు. అధికారులు వివిధ కారణాలతో అడ్డంకులు సృష్టించడంతో టీడీఆర్ బాండ్లు అందలేదని వాపోయారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఓ తీరుతో చాలా నష్టపోయామని ఆరోపించారు. చట్టానికి వ్యతిరేకంగా రాత్రికి రాత్రే ఇష్టానుసారంగా భవనాలను కూల్చి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం కూడా రాకుండా చేశారని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేని కోరారు. రోడ్డు విస్తరణ అనంతరం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో భవనాలకు మరమ్మతులు నిలిచిపోయి వ్యాపారాలు కోల్పోతున్నామని వాపోయారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తులు కావడంతో డాక్యుమెంట్లు పూర్తిగా ఉండటం లేదని తెలిపారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపాటు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం రోడ్డు విస్తరణ జరగలేదని వ్యాఖ్యానించారు. అధికారులందరూ ఈ అక్రమ వ్యవహారంలో భాగస్వాములయ్యారని ఆరోపించారు. భవన యజమానుల ఇష్టానుసారం అధికారులు కట్టడాలను తొలగించకపోవడం దురదృష్టకరం అన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు నష్టపోయిన 166 మంది సమస్యలను వెంటనే పరిష్కరించి, టీడీఆర్ బాండ్లు 45 రోజుల్లో అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యజమానుల వద్ద ఉన్న డాక్యుమెంట్లను తీసుకుని, వారిని ఇబ్బందులకు గురిచేయకుండా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బాండ్లకు విలువ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బాధితులందరూ తమ డాక్యుమెంట్లను మున్సిపాలిటీ మేనేజరుకు అందించాలని ప్రత్యేక అధికారి ఉమాదేవి సూచించారు. సమావేశంలో కమిషనర్ నయీం అహ్మద్, డీఈ ఏడుకొండలు, ఆర్‌వో తోట వెంకటేశ్వరరావు, విద్యుత్ ఏఈ వెంకయ్య, భవన యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న భవన యజమానులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో రాయల సుబ్బారావు ,హెచ్‌ఎంలు తదితరులు

చేబ్రోలు: బడి వయస్సు కలిగిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికిపోతా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో ప్ల కార్డులు, ఫ్లెక్సీలు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పలువురు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపటానికి అంగీకరింపజేశారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచడానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారికి ప్రోత్సాహకాలు, తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్ మహీంద్రా నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 38 మంది విద్యార్థులు రూ 3.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు అర్హత పొందారన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె .కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని విభాగాల విద్యార్థులకు ఇప్పటి వరకు మొత్తం 644 మందికి ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కల్పనకు బహుళ జాతి కంపెనీలు ముందుకు రావడం విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలకు నిదర్శనమన్నారు. టెక్ మహీంద్ర నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సీఎస్‌సీ నుంచి 17 మంది, ఐటీ – 11, ఈసీఈ –4, సీఎస్‌బీఎస్ నుంచి ఆరుగురు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

డాక్టర్ రావూరి భరద్వాజ్‌కు నివాళి



భరద్వాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నరేంద్రకుమార్, ఉమాశంకర్ తదితరులు

గుంటూరు మెడికల్: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కళాప్రపూర్ణ డాక్టర్ రావూరి భరద్వాజ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, గుంటూరు తూర్పు సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ నేత మాగంటి సుధాకర్ యాదవ్, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మేడూరి శివ రామబ్రహ్మం, ఉపాధ్యక్షుడు కొత్తూరి మోహన్‌రావు, కార్యదర్శి జంపని రాధాకృష్ణమూర్తి, కోశాధికారి బసవపాత్రుని మల్లికార్జునరావు, ఉప కార్యదర్శి అత్తారి వీరభద్రచార్యులు, రాష్ట్ర వైశ్య బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు హనుమంతరావు ఉన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడిపేట 2/7వ అడ్డ రోడ్‌లోని గౌరివిశ్వేశ్వరాలయంలోని స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శుక్రవారం స్వామికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. మల్లాది వెంకటరవి కుమార్, నాగలక్ష్మి, కౌణతం శ్రీనివాసరావు, . ధనలక్ష్మి దంపతులతో అర్చక స్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, మల్లిక్, చక్రపాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బహుజనుల ఆత్మబంధువు పాశ్వాన్



పాశ్వాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరుణ్‌కుమార్, బాబూరావు తదితరులు

నెహ్రూనగర్: బహుజనుల ఆత్మ బంధువు రాం విలాస్ పాశ్వాన్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. రాం విలాస్ పాశ్వాన్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన రాంవిలాస్ పాశ్వాన్ ఆయన ఏ ప్రభుత్వంతో కలిసి పనిచేసిన అంతిమంగా అట్టడుగు వర్గాల జాతి ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చే వారని గుర్తు చేశారు. ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యునిగా, ఒకసారి రాజ్యసభ సభ్యునిగా ప్రధాని వీపీ సింగ్ మొదలుకుని ఆరుగురు ప్రధాన మంత్రుల క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఘనత రాంవిలాస్ పాశ్వాన్‌కే దక్కుతోందన్నారు. ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, చుండూరు ఘటనలతో చలించిన రాంవిలాస్ పాశ్వాన్ అప్పటికే రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరహక్కుల రక్షణ చట్టం ఒక్కటే ఎస్సీ, ఎస్టీలకు సరిపోదని, అటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చట్టం తేవాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకురావడంతో కృతకృత్యులయ్యారన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన కులాల అభివృద్ధి సంక్షేమం కోసం, బీపీ మండల్ కమిషన్ అమలు కోసం విశేష కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలకృష్ణ, విల్సన్, వినయ్, రామకృష్ణ, రవికుమార్, సుమంత్, కెనడీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలి



వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీర రాఘవరావు

> కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్ వీర రాఘవరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలిగి తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్ డాక్టర్ వీర రాఘవరావు పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ పినపాటి ప్రభుదాస్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ప్రమీల అధ్యక్షత వహించారు. వీర రాఘవరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంతో విద్యలో రాణించడంతో పాటు భవిష్యత్తులో కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంలో అవసరమైన సలహాలు అందించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థులు, యువత కోసం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఽ యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



గుంటూరు ఈస్ట్: హిందూ కళాశాల సెంటర్‌లో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోలపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మొత్తం 20 ఆటోలపై కేసులు రాసి, రూ.1,30,750 అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు. ఆటోడ్రైవర్లకు లైసెన్సు, యూనిఫాం, ఇన్సూరెన్సు లేని, డాక్యుమెంట్లు సరిగా లేని ఆటోలపై కేసులు రాసినట్లు వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్సు లేని డ్రైవర్లు లైసెన్సు ఎలా పొందాలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆటో నడుపుతున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

వాహన యజమానులపై కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నెహ్రూనగర్: నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కేసులు నమోదు చేశామని రవాణా శాఖ జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో పలు ప్రాంతాల్లో అధికారులు వాహనాలను తనిఖీ చేసి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 25, ఇన్సూరెన్స్ లేని వాటిపై 31, ఫిట్నెస్ లేనందుకు 10, పన్ను చెల్లించకుండా వాహనం నడిపిన వారిపై 4, అదనపు ప్రయాణికులను ఎక్కించుకున్నందుకు 2, పర్మిట్ లేనందుకు 2, ఇతర నిబంధనలు పాటించనందుకు 7 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నిబంధనలు పాటించకుంటే ముందు కూడా తనిఖీల్లో తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

టారిఫ్‌లు భారీగా పెంచడం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కొండా శివరామిరెడ్డి

లక్ష్మీపురం: కేంద్రంలో ప్రధాని మోదీ మూడోసారి పీఠం మీద కూర్చున్న కొన్ని రోజుల్లోనే ప్రైవేటు కంపెనీలు మొబైల్ రీచార్జిల టారిఫ్‌లను భారీగా పెంచి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపడం దారుణమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'అడ్డూ అదుపు లేకుండా ప్రైవేటు టెలి కంపెనీల విజృంభణ' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ జనం మొబైల్ అవసరాన్ని లాభాల మూటలుగా మార్చుకోడమే ప్రైవేటు టెలికాం కంపెనీల అసలు ఉద్దేశమని విమర్శించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో రూ.20,607 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా, ఎయిర్ టెల్ రూ.7,467 కోట్ల లాభాన్ని వెనుకేసుకుందన్నారు. ఈ కంపెనీల ధన దాహం తీరలేదని, దేశంలో మొబైల్ ఫోన్లు వాడుతున్న కోట్ల మంది నుంచి తలో కొంత అదనంగా పిండుకున్నా రూ. వేల కోట్లను సులభంగా గడించవచ్చనే ఈ భారాన్ని వినియోగదారులపై వేశారని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పేరుతో ఈ కంపెనీలు ప్రధాన పార్టీలకు కోట్లాది రూపాయలు ఇచ్చి తమను ఎవరూ ఏమీ అనకుండా చేసుకున్నారని విమర్శించారు. న్యాయవాది ఎ. హరి మాట్లాడుతూ పరస్పరం పోటీదారులమంటూ పోజులిస్తూ చార్జీల వడ్డనలో మాత్రం కూడబలుక్కొని వ్యవహరించాయని కంపెనీలను దుయ్యబట్టారు. ఎక్కువ మంది అనివార్యంగా వాడే ప్లాన్‌ల మీద తెలివిగా భారాలను మోపడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, కార్పొరేట్లకు దోచిపెట్టే ధోరణి ఈ ప్రొవైడర్ల దోపిడీకి మార్గం సుగమం చేస్తున్నాయని ఆరోపించారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఓమెగా హాస్పిటల్స్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మహతి పేర్కొన్నారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అధ్యాపకులకు క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మహతి మాట్లాడుతూ తొలిదశలో గుర్తించడం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. క్యాన్సర్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబార ఘట్టం



నాటికలోని ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణరాయబారంలోని మయసభ ఏకపాత్రాభినయం, రాయభార ఘట్టం ప్రదర్శించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మయసభలో సుయోధన పాత్రలో అట్ల రామకృష్ణరెడ్డి, రాయభార ఘట్టంలో శ్రీకృష్ణగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సుయోధనగా షేక్ లాల్‌అహ్మద్, కర్ణగా షేక్ చినలాల్, అశ్వద్ధామగా షేక్ మీరావలి, ధృతరాష్ట్రునిగా షేక్ నాజర్, వికర్ణగా యు.మునుస్వామి, భీష్మగా జె.రాఘవరావు, ద్రోణగా ఆర్.సంగమేశ్వరరావు తమ పాత్రల్లో నటించారు. నాటకాన్ని రక్తికట్టించగా, ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంగీత సహకారాన్ని సిరిగిరి సాంబశివరావు అందించగా, డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ పర్యవేక్షించారు. అనంతరం కళాకారులను దేవాలయ పాలక మండలి సత్కరించారు.

సీసీఆర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిణి శ్రీ రంజని

వడ్లమాను(తాడికొండ): కౌలు రైతు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తుళ్ళూరు మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీరంజని తెలిపారు. తుళ్ళూరు మండలం వడ్లమాను గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీపై సంయుక్తంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏఓ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పొలం లేకుండా కౌలుకు పంట సాగు చేసే రైతులు, సొంత పొలం ఉన్నప్పటికీ కౌలుకు పొలం తీసుకొని సాగుచేసే రైతులు ఈ సీసీఆర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీని వల్ల పంట నమోదుతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్టం వాటిల్లినపుడు ప్రమాద బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పొందే అకాశం ఉందన్నారు. రైతులు పొలం పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, భూమి కలిగిన రైతు ఆధార్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు ఫోటోలను వీఆర్‌వోకి లేదా రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వరి పండించే రైతులకు రాయితీ విత్తనాలు అందజేశారు. పిన్నక సాంబశివరావు, వెంకటరెడ్డి, పారు బుజ్జి, కొమరాబత్తిని శేఖర్ పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ప్రతి అమావాస్యకు కాశీ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, ఆకుల ఉమామహేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ జేవీ నారాయణ, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివసత్యనారాయణ, జూట్రు ఏడుకొండలు, పందేటి సాంబ శివరావు, దామర్ల వీరాస్వామి, కగ్గా శ్రీను, దామర్ల నాగరాజు, రాజారావు, అచ్చయ్య పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే రూ.వెయ్యి జరిమానా

మంగళగిరి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే రూ.1000 జరిమానా విధించడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ క్రాంతి కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా బహిరంగంగా మద్యం తాగితే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.